క్లుప్తంగా

కులగణను పరిశీలించిన జేసీ శ్యాంప్రసాద్

దాచేపల్లి : కులగణన ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. నగర పంచాయతీతో పాటుగా మండల వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ దాచేపల్లిలో జరుగుతున్న కులగణను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. జేసీ వెంట తహసీల్దారు జి.కరుణకుమార్, కమిషనర్ సత్యనారాయణ తదితరులున్నారు. అనంతరం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో జేసీ శ్యాంప్రసాద్ సమీక్ష జరిపారు. జగనన్న భూ రక్ష, భూ హక్కు పథకంపై అధికారులకు పలు సూచనలు చేశారు. రీ సర్వేను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను జేసీ ఆదేశించారు.

పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం



దుర్గి: పేద ప్రజలకు ఉన్నత స్థాయి వైద్యమందించటమే జగనన్న ఆరోగ్య సురక్ష ముఖ్య ఉద్దేశమని మండల ప్రత్యేకాధికారి కె.సంజీవరావు, తహసీల్దార్ ఎం.రమేష్‌కుమార్, ఎంపీడీఓ కె.సమతావాణి పేర్కొన్నారు. శుక్రవారం ధర్మవరం సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచి గంగారపు వెంకటరెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. ధర్మవరం, శ్యామరాజపురం గ్రామాల ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పంచాయతీ సెక్రటరీ శివకుమార్, డాక్టర్ సతీష్, ఏపీఓ వెంకటేశ్వర్లు, వివిధ విభాగాల స్పెషలిస్టు వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా యోగి వేమన జయంతి



దాచేపల్లి : యోగి వేమన జయంతి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వేమన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం పల్లకీలో వేమన చిత్రపటాన్ని గ్రామ పుర వీధుల్లో ఊరేగించారు. నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, వేదిక అధ్యక్షుడు ఘడియం పెద్దరెడ్డి, సభ్యులు ఎలిశెట్టి రమేష్, పగడాల రామయ్య పాల్గొన్నారు.

ఆయిల్ ట్యాంకర్ ఢీకొని వ్యక్తి మృతి

యడ్లపాడు: కారును ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టిన ప్రమాదంలో కారులోని వ్యక్తి దుర్మరణం పాలైన ఘటన 16వ నంబర్ జాతీయ రహదారిపై యడ్లపాడు వద్ద గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. రేపల్లెకు చెందిన సుఖవాసి భానుప్రకాష్, సాంబశివరావు, హేమకుమార్, విజయవాడకు చెందిన శ్రీనాథ్ బంధువులు. అందరూ కారులో విజయవాడ నుంచి తిమ్మాపురంలోని బంధువుల ఇంటికి బయలుదేరారు. కారు యడ్లపాడు ఎన్ఎస్ఎల్ నూలుమిల్లు వద్దకు రాగానే కారును వెనుక నుంచి ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టింది. ప్రమాదంలో కారు వెనుక భాగంలో కూర్చున్న భానుప్రకాష్, హేమకుమార్ గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో చిలకలూరిపేటలోని ఆసుపత్రికి తరలిస్తుండగా భానుప్రకాష్ (43) మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడికి భార్య రాధిక, కుమార్తె ఉన్నారు. డ్రైవర్ శ్రీనాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అక్రమ మద్యం కేసులో నిందితుడి అరెస్ట్

నరసరావుపేట టౌన్: అక్రమ మద్యం కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 18 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్ఐ సురేంద్రబాబు శుక్రవారం తెలిపారు. కోటప్పకొండ సమీపంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్నా సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. అక్కడ అక్రమంగా 18 మద్యం బాటిళ్లు కలిగి ఉన్న వెంకటరెడ్డిని అరెస్ట్ చేశామన్నారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

నిలువెత్తు స్ఫూర్తి ప్రదాత అంబేడ్కర్

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిన ప్రజానీకం



విజయవాడకు తరలివెళ్తున్న జెడ్పీ వైఎస్‌చైర్మన్ నర్సిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు

రెంటచింతల: బడుగుబలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నేటి యువతకు నిలువెత్తు స్ఫూర్తి ప్రదాత అని జిల్లా పరిషత్ వైఎస్ చైర్మన్ శౌంఠిరెడ్డి నర్సిరెడ్డి అన్నారు. శుక్రవారం అంబేడ్కర్ ఆశయ సాధకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడ నడిబొడ్డున ప్రతిష్మాతంగా ఏర్పాటు చేసిన 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఆయన వెళ్లారు. సమ సమాజ స్ఫూర్తి, రాజ్యాంగ రూపశిల్పి అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటుచేయడం ఎంతో గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, పార్టీ మండలాధ్యక్షుడు గొట్టం బ్రహ్మారెడ్డి, జేసీఎస్ జిల్లా కన్వీనర్ మోర్తల ఉమ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి యార్ల మహాలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

గురజాల: విజయవాడలో 206 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు శుక్రవారం మండలం నుంచి ప్రజలు భారీగా తరలివెళ్లారు. వైస్ ఎంపీపీ వేముల శేషమ్మ చలమయ్య, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు, ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి, మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, పట్టణ కన్వీనర్ కె.అన్నారావు పలువురు నాయకుల ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనాల్లో భారీగా తరలివెళ్లారు.

కారెంపూడి: సామాజిక సమతా సంకల్ప సభలో పాల్గొనేందుకు, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహా శిల్పం ఆవిష్కరణను వీక్షించేందుకు మండలం నుంచి శుక్రవారం భారీగా యువత విజయవాడ తరలివెళ్లింది.

దుర్గి: విజయవాడలో జరిగిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు శుక్రవారం అడిగొప్పల, ముటుకూరు, కోలగుట్ల, ధర్మవరం పలు గ్రామాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రజలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ధర్మవరంలో బస్సును జెడ్పీటీసీ శెట్టిపల్లి యలమంద జెండా ఊపి ప్రారంభించారు.

పిడుగురాళ్ల: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని స్వరాజ్ మైదానంలో ఏర్పాటు చేయటం కొత్త చరిత్ర సృష్టించినట్లు అయ్యిందని పట్టణంలోని లెనిన్ నగర్ కార్ప్స్ స్కూల్ హెచ్ఎం పి.లత అన్నారు. శుక్రవారం కార్ప్స్ స్కూల్‌లో అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దయామని, సునిత, షేక్ అబ్దుల్ రహీం, విద్యార్థులు పాల్గొన్నారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ నేపథ్యంలో విజయవాడకు పట్టణంలోని అన్ని వార్డుల నాయకులు భారీ సంఖ్యలో శుక్రవారం తరలి వెళ్లారు. వైఎస్సార్ సీపీ యూత్ ప్రెసిడెంట్ మందా సుధీర్, మార్కెట్ యార్డు చైర్మన్ కొమెర వెంకటేశ్వర్లుతోపాటు పలువురు నాయకులు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. పట్టణం నుంచి అన్ని వార్డుల కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జిలు, వైఎస్సార్ సీపీ నాయకులు, అంబేడ్కర్ వాదులు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు.

దాచేపల్లి : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు శుక్రవారం భారీగా విజయవాడకు తరలివెళ్లారు. సభకు వెళ్లే కార్యకర్తలకు భోజనం ఏర్పాట్లు చేశారు.



అంబేడ్కర్ చిత్ర పటానికి చిన్నారుల నివాళి



విజయవాడకు తరలివెళ్తున్న వైస్ ఎంపీపీ, ప్రజలు



దాచేపల్లి: బస్సులో బయలుదేరిన నేతలు



పేటసన్నెగండ్ల గ్రామం నుంచి..



పిడుగురాళ్ల పట్టణం నుంచి..

కలుషిత తాగునీటితో అస్వస్థత



ఇంటింటి సర్వేలో డాక్టర్ విజయానాయక్, వైద్య సిబ్బంది

కారెంపూడి: మండలంలోని పెదకొదమగుండ్ల గ్రామ శివారు బ్రహ్మనాయుడు కాలనీలో తాగునీరు కలుషితం అవుతుండడంతో కాలనీ వాసులు తరచూ అస్వస్థతకు గురవుతున్నారు. పలుచోట్ల వాటర్ పైపులు పగిలిపోయి అందులోకి మురుగు నీరు చేరడంతో నీరు కలుషితమవుతోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం గాదెవారిపల్లె పీహెచ్‌సీ డాక్టర్ విజయానాయక్, సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, ఏఎన్ఎం రత్నం, ఎంఎల్‌హెచ్‌పీ రత్నకుమారి, వైద్య సిబ్బంది సుబ్బారెడ్డి, రామ్మోహన్, ఆశ వర్కర్ రమణ కాలనీలో డోర్ టు డోర్ సర్వే నిర్వహించారు. ప్రస్తుతం ఒకరు జ్వరంతో ఉన్నట్లు మరో 8 మంది చర్మంపై మచ్చలు రావడం, కాళ్ల వాపునకు గురయ్యారని గుర్తించారు. వీరికి వైద్య సేవలు గతం నుంచే అందిస్తున్నామని వైద్య సిబ్బంది తెలిపారు. పైపుల లైన్లు పగిలిపోయి నీరు కలుషితం అవుతోందని, నీటి నమూనాను సేకరించి ల్యాబ్‌కు పంపామని వివరించారు. పగిలిపోయిన పైపుల స్థానంలో కొత్తవి వేయడమే దీనికి పరిష్కారమన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయించడంతో పాటు వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. అయితే ప్రత్యామ్నాయం లేకపోవడంతో కొందరు అదే కలుషిత నీటిని వాడుతుండడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తూనే ఉన్నాయన్నారు.

కొనసాగుతున్న ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు



వేలూరు, గణపవరం జట్ల మధ్య హోరాహోరీగా క్రికెట్ మ్యాచ్..

చిలకలూరిపేటటౌన్: ఆడుదాం ఆంధ్రాలో భాగంగా శుక్రవారం పట్టణంలోని ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్, ఆర్‌వీఎస్ సీవీఎస్ హైస్కూల్, వేలూరు జెడ్పీహైస్కూల్, పురుషోత్తమపట్నంలో క్రీడా ప్రాంగణంలో క్రికెట్ విభాగంలో పోటీలు కొనసాగాయి. బాలుర విభాగంలో మొత్తం 30 టీంలు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో డైక్‌మెన్ నగర్-1, సుభానీ నగర్-1, బొప్పూడి, కావూరు, యానాదికాలనీ, గంగన్నపాలెం, మద్దినగర్, జాకీర్ హుస్సేన్ వీధి, తూర్పు మాలపల్లి, వేలూరు, గణపవరం-1, పోతవరం, గోవిందపురం, మురికిపూడి -2, పురుషోత్తమపట్నం 2 టీంలు గెలుపొందాయి. హోరాహోరీగా టీములు తలపడ్డాయి.

శావల్యాపురం మండలంలో..

శావల్యాపురం: ఆడుదాం-ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా మండల స్థాయి క్రీడా పోటీలు క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారంతో ముగిసినట్లు ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య తెలిపారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండల స్థాయిలో వాలీబాల్ క్రీడా పోటీల్లో మహిళలు-శావల్యాపురం, పురుషులు విభాగంలో-శావల్యాపురం, క్రికెట్ పోటీల్లో-పురుషులు వేల్పూరు-1, మహిళలు విభాగంలో-శావల్యాపురం జట్టు, ఖోఖో క్రీడా విభాగంలో పురుషులు -వేల్పూరు-1, మహిళలు-మతుకుమల్లి, జట్టు, కబడ్డీ క్రీడా విభాగంలో పురుషులు వేల్పూరు-2, మహిళలు -శావల్యాపురం, బ్యాడ్మింటన్ క్రీడా పోటీలో రెండు స్థానాలు మతుకుమల్లి జట్లు కైవసం చేసుకున్నాయి. గెలిపొందిన జట్లు నియోజకవర్గ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. వినుకొండ పట్టణంలో జరిగే నియోజకవర్గ స్థాయి పోటీలు ఈనెల 24 నుంచి 30 వరకు జరుగుతాయన్నారు. నియోజకరవర్గ స్థాయిలో పాల్గొనే క్రీడాకారులకు ప్రభుత్వ పరంగా క్రీడా సామాగ్రి అందజేయనునన్నట్లు చెప్పారు. ఆయనతో పాటు వ్యాయమా ఉపాధ్యాయులు రాగుల రాధాకృష్ణమూర్తి, పి.వాణి, కాకుమాను రాజేష్, ఎస్.సుజాత తదితరులు పాల్గొన్నారు.

బొల్లాపల్లి మండలంలో...

బొల్లాపల్లి: మండల కేంద్రంలో ఆడుదాం ఆంధ్ర పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఆయా పోటీల్లో పేరూరుపాడు, వెల్లటూరు, గుమ్మనంపాడు, చక్రాయపాలెం, గరకపాడు తదితర సచివాలయాల నుంచి ఆయా విభాగాల్లో జట్లు తలపడ్డాయి. మండల స్థాయిలో కబడ్డీ లో వెల్లటూరు, ఖోఖో లో పేరూరుపాడు టీమ్ బాడ్మింటన్‌లో వెల్లటూరు టీమ్‌లు ఫైనల్‌కు చెరుకున్నాయని ఇన్‌చార్జి ఎంపీడీఓ తెలిపారు. ఆటల పోటీలు ప్రారంభలో ఎంపీపీ బత్తి రాములు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

కారుమంచి ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజరు రాంబాబు



నామినీకి చెక్కు అందజేస్తున్న మేనేజరు రాంబాబు

శావల్యాపురం: ఎస్‌బీఐ బ్యాంకు సేవలను బ్యాంకు ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కారుమంచి ఎస్‌బీఐ బ్యాంకు మేనేజరు కె.రాంబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని కారుమంచి ఎస్‌బీఐ బ్యాంకులో ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకంలో భాదిత కుటుంబ సభ్యురాలకు రూ. 2లక్షల చెక్కు అందజేశారు. ఈసందర్భంగా బ్రాంచ్ మేనేజరు మాట్లాడుతూ మండలంలోని గుంటుపాలెం గ్రామానికి చెందిన పాములపాటి వెంకటేశ్వర్లు గుండెపోటుతో గత రెండు నెలల క్రితం మృతి చెందాడు. ఈక్రమంలో ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకంలో రూ. 430 రూపాయాలు ప్రీమియం చెల్లించగా క్రమంలో సాధారణ మృతిలో భాగంగా మృతుడు భార్య నామిని పాములపాటి సుబ్బులుకు రూ. 2 లక్షల చెక్కును అందజేశామన్నారు. గతంలో ఇలాంటి క్లయిమ్స్ ఆరు మంది బాధిత కుటుంబాలకు ఎస్‌బీఐ బ్యాంకు తరుపున బాధిత కుటుంబాలకు అందజేశామన్నారు. ఎస్‌బీఐ బ్యాంకు ఖాతాదారులు తప్పనిసరిగా బీమా యోజన పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయనతో పాటు నగదు అధికారి లక్ష్మణారావు, బ్యాంకు సిబ్బంది జాన్‌సైదులు, కరిముల్లా పాల్గొన్నారు.

గ్రామోదయంతో సమస్యల పరిష్కారం



అంగన్వాడీ కేంద్రం తనిఖీలో తహసీల్దారు పుల్లారావు, పీఆర్ డీఈ పాశం శ్రీనివాసరెడ్డి

పశర్లపాడు(రెంటచింతల): గ్రామాల్లో నెలకున్న సమస్యల పరిష్కరానికి గ్రామోదయం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు కట్టేకోట పుల్లారావు అన్నారు. పశర్లపాడు గ్రామంలో శుక్రవారం గ్రామోదయం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖాధికారులతో కలిసి పలు కాలనీల్లో పర్యటించారు. గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రభుత్వ నిధులతో చేపడుతున్న గ్రామాభివృద్ధి పనులను సహకరించి, సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. కాలనీలలో మంచినీటి సమస్య లేకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్బీకే, అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. ప్రభుత్వం బాలింతలకు, గర్భిణులకు అందజేస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ షేక్ హసాన్, పీఆర్‌డీఈ పాశం శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షులు గొట్టం బ్రహ్మారెడ్డి, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ కొత్తా నరేంద్రరెడ్డి, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

22 నుంచి ఉచిత యోగా శిక్షణ

నరసరావుపేట ఈస్ట్: శ్రీవెంకటేశ్వర యోగ సేవాకేంద్రం నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో ఈనెల 22వతేదీ సోమవారం నుంచి 174వ ఉచిత యోగశిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు యోగాచార్యులు కూనిశెట్టి వెంకటజనార్ధన్ గురూజీ శుక్రవారం తెలిపారు. పట్టణంలోని శ్రీపట్టాభిరామస్వామి ఆలయంలో ప్రతిరోజు ఉదయం 5గంటల నుంచి 7గంటల వరకు నెల రోజుల పాటు యోగశిక్షణ ఉంటుందన్నారు. శిబిరంలో 42యోగ భంగిమలు, ప్రాణాయామం; ఆహార నియమాలు, ధ్యానం, సూర్య నమస్కారాలు భోధించనున్నట్లు వివరించారు. నేటి పోటీ ప్రపంచంలో బీపీ, షుగర్ వ్యాధి బారిన పడుతున్న వారు రోజు రోజుకు పెరిగిపోతున్నారని, వారందరూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు యోగ చక్కటి మార్గమని తెలిపారు. వివరాలకు 9490846333, 9491665733 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

21న మేగా కంటి వైద్య శిబిరం

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామం శివాలయంలో కీ.శే గోపు శ్రీరాములు, కాకాని నాగేంద్రం, కాకాని శ్రీనివాసరావుల జ్ఞాపకార్థం ఉచిత కంటి వైద్య శిబిరం ఈనెల 21న మెగా వైద్య శిబిరం నిర్వహించినట్లు కమిటీ ప్రతినిధి కాకాని అంజిబాబు శుక్రవారం తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పెదకాకాని శంకర కంటి వైద్యశాల జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అవరమైన వారి ఉచితంగా బస్ సౌకర్యంతో పాటు ఆపరేషన్ భోజన వసతి కల్పిస్తామన్నారు. శిబిరంలో పాల్గొనే వారందరు ఆధార్, ఓటరు కార్డు జిరాక్స్‌లతో సెల్ నంబరుతో తప్పనిసరిగా తీసుకొని రావలాన్నారు. కంటి శుక్లముల ఆపరేషన్లు చేయించుకునే వారందరు ఇతర ఆరోగ్య సమస్యలకు సంబంధించి వైద్యులు ధ్రువీకరణ పత్రాలతో శిబిరంలో అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 9492081140 సెల్ నంబరును సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాచర్ల: మాచర్ల విద్యుత్ శాఖ సబ్ డివిజన్ పరిధిలోని 33 కేవీ లైన్, వెల్దుర్తి-2, 33కేవీ అనుపు, కొప్పునూరు, అగ్ని గుండాల, మండాది, రింగ్ రోడ్డు, కోలగుట్ల, ముటుకూరు 33/11 సబ్ స్టేషన్‌ల పరిధిలో మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జె.హరిబాబు, డీఈ ఎ.రామయ్య శుక్రవారం తెలిపారు. డివిజనల్ పరిధిలోని విద్యుత్ లేన్స్ మెయింటెనెన్స్, నేషనల్ హైవే వెరిఫికేషన్ పనుల నిమిత్తం విద్యుత్ సరఫరాను నిలిపివేయటం జరుగుతుందని, సబ్ స్టేషన్‌ల పరిధిలోని గ్రామస్తులంతా సహకరించాలని కోరారు.

గురజాల: మండలంలోని దైద, పులిపాడు సబ్ స్టేషన్‌ల పరిధిలోని గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ ఏడీఈ ఎం.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దైద, తేలుకుట్ల, గోట్టిముక్కల, గంగవరం, పులిపాడు గ్రామాల్లో ఉదయం 10 నుంచి మ ధ్యాహ్నం 2గంటలవరకు విద్యుత్ లేన్ల మరమ్మతులు కారణంగా నిలిపివేయ డం జరుగుతుందని పేర్కొన్నారు. రైతులు,ప్రజలు సహకరించాలని తెలిపారు.

దుర్గి మండల కేంద్రమైన దుర్గితోపాటు అన్ని గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ కె.రాంబాబు శుక్రవారం తెలిపారు. వినియోగదారులు, రైతులు, వ్యాపారులు సహకరించాలన్నారు.

వేర్వేరు గ్రామాల్లో గ్రామోదయం

బొల్లాపల్లి : మండలంలోని మూగచింతలపాలెం, బొల్లాపల్లిలో గ్రామోదయం శుక్రవారం నిర్వహించారు. రక్త హీనత ఉన్న బొల్లాపల్లి బీసీ కాలనీలో రక్త హీనత ఉన్న విద్యార్థినిలను గుర్తించి తల్లిదండ్రులకు తీసుకొవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్యవివాహాలను అరికట్టడం పై అవగాహన కల్పించారు. పీడబ్లూడీ ఓటర్లు, ఓటు నమోదుకు పోలింగ్ కేంద్రానికి వెళ్లకుండ ఓటు హక్కు వి నియోగించుకునే విధంగా ప్రభుత్వం సౌకర్యాలు కల్పించిందని అధికారులు వివ రించారు. ఎంపీపీ బత్తిరాములు, తహసీల్దార్ ఎన్ దుర్గేశ్వరరావు, ఐసీడీఎస్ సీడీపీఓ బి అరుణ, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్‌కె జిలానీ బాషా, ఎంఈఓ1 సయ్యద్ జఫ్రుల్లా, ఎంఈఓ2 కె పార్వతి, సూపర్‌వైజర్లు వి శ్రీదేవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ధర్మప్రచార వారోత్సవాలు

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెంలోని శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయంలో ఈనెల 20వ తేదీ నుంచి 26 తేదీ వరకు ధర్మప్రచార వారోత్సవాలను నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈవో టి.సుధాకరరెడ్డి శుక్రవారం తెలిపారు. సనాతన హిందూ ధర్మ పరిరక్షణకోసం, హిందూ ధర్మాన్ని మరింతగా వ్యాప్తిచేసేందుకు, ఆలయ సంస్కృతిని ప్రజలకు తెలియజేసేందుకు ధర్మప్రచారాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వారం రోజులపాటు ప్రతిరోజు సాయంత్రం గం.6నుంచి గం.7.30వరకు సాంస్కృతిక కార్యక్రమాలు, ధర్మప్రచార ప్రవచనలు ఉంటాయని వివరించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.

కుల గణన సర్వే ప్రారంభం

శావల్యాపురం: కుల గణన ప్రక్రియలో వలంటీర్లు సచివాలయ ఉద్యోగులు కీలక పాత్ర పోషించి సర్వే నూరుశాతం అయ్యేలా చూడాలని మండల ప్రత్యేక అధికారి మూలె వెంకటరెడ్డి అన్నారు.శుక్రవారం మండలంలోని కొత్తలూరు గ్రామంలో గ్రామోదయం కార్యక్రమంలో భాగంగా కుల గణన సర్వే పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయనతో పాటు పంచాయతీ కార్యదర్శి మహేంద్ర సచివాలయ ఉద్యోగి,వలంటీర్లు పాల్గొన్నారు.